క్లుప్తంగా

నేడు పంచారామ క్షేత్రంలో సామూహిక వ్రతాలు



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

సామర్లకోట: శ్రావణ మాసం సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మూడో శుక్రవారంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఈఓ భళ్ల నీలకంఠం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతాలకు కావలసిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫొటోను దాతలు సమకూరుస్తారన్నారు. వరలక్ష్మీ వ్రతాలకు వచ్చే మహిళలు కేజీన్నర బియ్యం, కలశ చెంబు, బ్లౌజ్ మాత్రమే తీసుకురావలసి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుము చెల్లిస్తారని తెలిపారు. వ్రతాలకు హాజరయ్యే వారు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వీరు ప్రతి శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహించే సామూహిక వ్రతాలకు హాజరు కావాలన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేస్తారన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీవిద్య



సామర్లకోట: కొత్త మున్సిపల్ కమిషనర్‌గా ఏ శ్రీవిద్య నియమితులయ్యారు. ఇప్పటి వరకు పని చేస్తున్న కమిషనర్ జె రామారావును గతంలో పని చేసిన హోదాలోనే గుంటూరు కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. భీమవరం మున్సిపాలిటీలో శ్రీవిద్య అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తుండగా, ఆమెను ప్రభుత్వం సామర్లకోట కమిషనర్‌గా నియమించింది.

ఆయాల బకాయిలు విడుదల చేయాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆయాలు

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాల జీతాల బకాయిలను సత్వరం విడుదల చేయాలని సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. సంఘ కార్యదర్శి కర్రి దుర్గ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఆయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కంటిన్యుజెన్సీ వర్కర్లుగా కొనసాగుతున్నారన్నారు. పాఠశాలల్లో తమను పర్మినెంట్ వర్కర్లుగా గుర్తించి, గతం నుంచి బకాయి ఉన్న ఆయాల జీతాలను సత్వరమే విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎంఈఓ చౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, తిక్కల సత్యవతి, కరక వీరమణి, నాగమణి, ఎండీ బేబీ, రొంగల బేబీ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పిఠాపురం గ్రామీణ మండలం వీరవరం గ్రామానికి చెందిన వెలుగుల బలరాం(35) పురుగు మందు తాగి, స్థానిక వైద్యుల సిఫార్సు మేరకు ఈ నెల 21న కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఘటనకు కారణాలు తెలియరాలేదు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వైద్య విద్యార్థినులు, మహిళా రోగులు, వైద్యుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ లావణ్యకుమారి, ఇతర వైద్యాధికారులకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. మహిళల రక్షణకు సీనియర్ వైద్యులు, వైద్యాధికారిణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భద్రతా పరిస్థితులపై కమిషనర్ భావన గురువారం రాత్రి ఆకస్మిత తనిఖీ చేశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్య కుమారితో కలిసి కమిషనర్ జీజీహెచ్ ఆవరణను పరిశీలించారు. నర్సింగ్ హాస్టల్, అలాగే తల్లి, పిల్లల వార్డులను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ అధికారులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. తల్లీపిల్లల వార్డులో రోగుల పరిస్థితిపై కమిషనర్ ఆరా తీశారు. చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్న పిల్లల ఆరోగ్యంపై అక్కడున్న వైద్యులతో మాట్లాడారు.

వన్ వే..! నో వే..

- ట్రాఫిక్ నిబంధనల అమలుకు తూట్లు
- పెరుగుతున్న వాహనాలతో సమస్య జటిలం
- సిబ్బంది కొరతతో మరింత తీవ్రం
- ‘కోట’లో తీరని చిక్కులు



గురువారం బ్రౌన్‌పేటలో ప్రమాదకరంగా ఎదురు పడిన ఆర్టీసీ బస్సు, కారు



సామర్లకోట-పెద్దాపురం రోడ్డు కూరగాయల మార్కెట్ వద్ద వాహనాల రద్దీ

సామర్లకోట: జిల్లాకు ముఖ్య కూడలైన సామర్లకోటలో 15 ఏళ్లుగా అమల్లో ఉన్న వన్ వే ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు పడుతున్నాయి. పెద్దాపురం -సామర్లకోట రహదారి నిర్మాణం, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డు నిర్మాణాలతో వన్ వేకు బ్రేక్ పడింది. ఇదే సమయంలో పోలీసు యంత్రాంగంలో బదిలీలు జరగడంతో, కొత్తగా వచ్చిన వారికి ఈ పరిస్థితిపై అవగాహన అంతగా లేకపోవడంతో పట్టించుకోవడం లేదు.

వంతెన పూర్తి కావడంతో..

సామర్లకోట పోలీసు స్టేషన్ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అంకబాబు వన్ వేపై దృష్టి సారిస్తారని పట్టణ వాసులు ఆశించారు. మూడు రోజులకే ఆయన వీఆర్‌కు వెళ్లారు. పట్టణంలో వన్ వే అమలు కాకపోవడంతో ట్రాఫిక్ సమస్య నానాటికీ తీవ్రమవుతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. పెద్దాపురం రోడ్డులో మఠంసెంటర్, పిఠాపురం రోడ్డులో బళ్ల బజార్ వద్ద తరచూ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై వంతెన నిర్మాణం పూర్తి కావడంతో, పిఠాపురం నుంచి భారీ వాహనాల రాకపోకలు ఇటీవల మరింతగా పెరిగాయి. పెద్దాపురంలో ఒకటే ప్రధాన రోడ్డు కావడంతో వన్ వే సాధ్యం కావడం లేదు. అదే పిఠాపురంలో వన్ వే అమలు జరుగుతోంది.

నిబంధనలకు పాతర

సామర్లకోట రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ నుంచి పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు వెళ్లే వాహనాలు పెద్దాపురం రోడ్డులో వెళ్లాల్సి ఉంటుంది. అదేవిధంగా పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు నుంచి వచ్చే భారీ వాహనాలు పిఠాపురం రోడ్డు మీదుగా రావాల్సి ఉంది. ఈ నిబంధనలను పట్టించుకోకపోవడం వలన ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయి. పిఠాపురం రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయి. అదేవిధంగా పెద్దాపురం రోడ్డులో మఠం సెంటర్ నుంచి బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దాంతో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

పట్టణ పరిధిలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట, బళ్ల మార్కెట్, గాంధీచౌక్, పోలీసు రింగ్ సెంటర్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్ వద్ద పోలీసు సిబ్బందిని నియమించాల్సి ఉండగా, సిబ్బంది కొరత పేరుతో ట్రాఫిక్ పరిస్థితిలను గాలికి వదిలేశారు. సిబ్బంది కొరత ఉన్న సమయంలో వన్ వేను తప్పనిసరిగా అమలు చేస్తే ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందనే వాదనలు ఉన్నాయి. కేవలం ట్రాఫిక్ సిబ్బంది ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని అంటున్నారు.

తిరిగి అమలు చేయాలి



గతంలో ఉండే వన్ వేను తిరిగి అమలు చేయాలి. బళ్ల మార్కెట్ సెంటర్, మఠం సెంటర్‌ల్లో సాయంత్రం సమయంలో రద్దీగా ఉంటుంది. ఆయా ప్రదేశాల్లో మద్యం షాపులున్నాయి. ఏలేరు కాలువపై వంతెన పూర్తి కావడంతో పిఠాపురం రోడ్డులో వాహనాల రద్దీ పెరిగింది. దాంతో ప్రతి రోజు ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. వన్‌వే అమలు చేయాలని గతంలో సామర్లకోట పోలీసు స్టేషన్‌కు వచ్చిన అప్పటి ఎస్పీకి వినతిపత్రం అందజేశాం.

– నూతలపాటి అప్పలకొండ, అధ్యక్షుడు, మానవ హక్కుల సంఘం, సామర్లకోట

కొంత కష్టంగా ఉన్నా..



పట్టణంలో గతంలో ఉండే వన్ వేను అమలు చేస్తాం. వన్ వే కచ్చితంగా అమలు చేయడం వలన కొంత మేరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. గతంలో ఉండే వన్ వేను అమలు చేయడం తప్పు కాదు. ప్రారంభంలో కొంత కష్టంగా ఉన్నా, అమలు జరిగితే సుఖవంతమైన ప్రయాణానికి అవకాశం ఉంటుంది. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతున్నాయి. వన్ వేకు సంబంధించి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తాం.

– అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్సై, సామర్లకోట

ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యం

ఆర్టీసీ కాకినాడ డీఎం కుమార్



సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లో నిర్మిస్తున్న షాపులను పరిశీలిస్తున్న డీఎం కుమార్

సామర్లకోట: బస్సు కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక బస్సు కాంప్లెక్స్‌ను ఆయన తనిఖీ చేశారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. బస్సుల రాకపోకల అనౌన్స్‌మెంట్ సక్రమంగా ఉండాలన్నారు. బస్సుల ప్రయాణంలో జాప్యం ఉంటే తమకు సమాచారం ఇవ్వాలని, ఆయా డిపోల అధికారులతో మాట్లాడతామని స్థానిక కంట్రోలర్ వజ్రానికి తెలిపారు. కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు ఫ్యాన్లు, లైట్ల సదుపాయం సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. బస్సుల రద్దీపై సమాచారం ఇస్తే, ఆయా రూట్లలో అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. బస్సు కాంప్లెక్స్‌లో నిర్మాణంలో ఉన్న షాపులను ఆయన పరిశీలించారు.

కుండపోతతో జలమయం



పెద్దాపురం దర్గా సెంటర్‌లో నీట మునిగిన ప్రధాన రహదారి



ప్లీడర్స్ వీధిలో వర్షపు నీటిలోనే వాహనాల రాకపోకలు

పెద్దాపురం: కుండపోత వర్షంతో పెద్దాపురం పట్టణ, గ్రామాల్లోని వీధులు జలమయమయ్యాయి. వాతావరణ పరిస్థితుల మార్పుల నేపథ్యంలో గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఏకధాటిగా కుండపోత కురిసింది. దీంతో పట్టణ ప్రాంతంలోని మురికివాడలు జలమయ్యాయి. రోడ్లన్నీ వర్షపు నీటితో ఏరులయ్యాయి. కాలువల్లోని మురుగు, చెత్తాచెదారం రోడ్లపైకి చేరింది. మున్సిపల్ సెంటర్, ప్లీడర్స్ వీధి, దర్గా సెంటర్, కబడ్డీ వీధి, నాయీ బ్రాహ్మణ కాలనీ, గోలి వారి వీధి, శివాలయం వీధి, మెయిన్ రోడ్డుతో పాటు, పలు మురికివాడల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పిఠాపురంలో భారీ వర్షం

పిఠాపురం: నియోజకవర్గంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం ఎండ మండి పోగా, మధ్యాహ్నానికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు, పిఠాపురం పట్టణంలో రోడ్లు జలమయమయ్యాయి. సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది.



గొల్లప్రోలులో వర్షపు నీటితో నిండిన రాయవరం సెంటర్

యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి

ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అంజిబాబు



గొల్లప్రోలులో నిరసన తెలుపుతున్న కార్మిక నాయకులు

పిఠాపురం: అనకాపల్లి జిల్లా, అచ్చుతాపురం ఎస్సీజెడ్‌లో ఉన్న ఎసెన్షియ ఫార్మా కంపెనీలో జరిగిన దుర్ఘటనకు నిరసనగా అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య కమిటీ ఆధ్వర్యంలో గొల్లప్రోలులో గురువారం ధర్నా నిర్వహించారు. ముందుగా మృతులకు నివాళులర్పించారు ఈ సందర్భంగా ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు మాట్లాడుతూ ఫార్మా కంపెనీ దుర్ఘటనలో 17 మంది కార్మికులు చనిపోవడం, 60 మంది క్షతగాత్రులు కావడం బాధాకరమైందన్నారు. యాజమాన్యాలు భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, పర్యవేక్షించవలసిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం వలన రాష్ట్రంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్ర హోం మంత్రి ఫోన్ చేస్తే లెక్కచేయకపోవడమే యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. యాజమాన్యంపై హత్యా నేరం కేసును నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ కోటి చొప్పున, క్షతగాత్రులకు రూ.50 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రకటించాలని, మృతుల కుటుంబాల్లో ఒక్కొక్కరి చొప్పున ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.నారాయణమూర్తి, గుడాల చార్లిస్, కేశవరపు వీరన్న, బల్ల సోమరాజు, బొడ్డు వెంకటరమణ, నాగమళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వ్రతాలు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 23న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏటా శ్రావణ మాసంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో భాగంగా ఈ నెల 23న ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు ‘ఉపాధి’ గ్రామ సభలు

కొత్తపల్లి: మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ పథకంపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. ఇందులో పథకంపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరించి, కొత్త పనులను గుర్తిస్తారన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై, రోడ్లు, పలు భవనాల నిర్మాణాలపై చర్చిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామసభ ప్రారంభమవుతుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపల్లి: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకరరావు తెలిపారు. సబ్ స్టేషన్‌లో కోనపాపపేట, కొమరగిరి ఫీడర్లకు వార్షిక మతమ్మతులు జరుగుతున్నట్టు చెప్పారు. దీంతో కోనపాపపేట, శ్రీరాంపురం, రావివారిపోడు, ముమ్మిడివారిపోడు, మల్లివారి తోట, రమణక్కపేటలో ఉన్న రొయ్యల చెరువులు, హేచరీలకు, కొమరగిరి జగనన్న కాలనీ, కొమరగిరి, గోర్స, వెంకటరాయపురం, చిన్నకలవల దొడ్డి, పెద్ద కలవలదొడ్డి, కుతుకుడుమిల్లి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిచిపోతుందని, వివరించారు.

తప్పని ముంపు సమస్య

సామర్లకోట: కొద్దిపాటి వర్షానికే స్థానిక భాస్కర్ నగర్ ముంపునకు గురవుతోంది. గురువారం కురిసిన వర్షానికి రోడ్లపై నీరు ఇళ్లలోకి చేరింది. భాస్కర్‌నగర్ ఏర్పడినప్పటి నుంచి వర్షాలకు నీటి ముంపు తప్పడం లేదు. గత 15 ఏళ్లుగా ప్రతిసారి ప్రజాప్రతినిధుల వద్ద తమ సమస్యను మొరపెట్టుకున్నా, పరిష్కారం కావడం లేదని భాస్కర్‌నగర్ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ముంపు నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ముంపులో సామర్లకోట శివారు భాస్కర్‌నగర్

శోకసంద్రంగా గాంధీనగర్

స్వగృహానికి నాగబాబు మృతదేహం

సామర్లకోట: ఫార్మా కంపెనీ దుర్ఘటన నేపథ్యంలో అచ్చుతాపురం నుంచి మొండి నాగబాబు మృతదేహాన్ని గురువారం రాత్రి 8.30కు పట్టణంలోని స్వగృహం ఉన్న గాంధీనగర్‌కు తరలించారు. మృతదేహాన్ని తెచ్చిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించడంతో గాంధీనగర్ ప్రాంతం శోకసంద్రంగా మారింది. బంధువులు, కుటుంబ సభ్యులు గుండెలు బాదుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు. గాంధీనగర్‌లో ప్రతిఒక్కరినీ పేర్లతో ఆప్యాయంగా పలకరించే నాగబాబు ఇక లేరని తెలిసి నమ్మలేక పోతున్నామని ఆ ప్రాంత ప్రజలు కంటతడి పెట్టారు. స్థానికులు చివరి చూపుగా నాగబాబు మృతదేహాన్ని చూచి శ్రద్ధాంజలి ఘటించారు.



నాగబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మరో ఫ్లై ఓవర్‌తో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే, అధికారులు



సామర్లకోటలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

సామర్లకోట: పట్టణంలో రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గురువారం పట్టణంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రదేశాన్ని ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 25 ఏళ్ల క్రితమే రెండో ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాల్సి ఉండగా, ఎవరూ ప్రయత్నించలేదన్నారు. స్థానిక గాంధీచౌక్ నుంచి కాకినాడ రోడ్డులో ఎల్‌సీ గేటు వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, ఆర్‌అండ్‌బీ జేఈ తోట మంగాదేవి, ట్రాన్స్‌కో ఏడీఈ కిరణ్, డిప్యూటీ తహసీల్దార్ వై శ్రీనివాసు, వీఆర్వోలు, రైల్వే ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

శాంతివర్ధన సేవలు అభినందనీయం



రైతులకు పశువుల మిక్చర్ ప్యాకెట్లు అందజేస్తున్న పీడీ, ఏడీ

పెద్దాపురం: గ్రామీణ ప్రాంత రైతాంగానికి అందుబాటులో శాంతివర్ధన ఆర్గనైజేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి, పశు సంవర్ధక శాఖ ఏడీ తుమ్మల రామస్వామి అన్నారు. కాండ్రకోట పశు వైద్య శాలలో గురువారం ఆత్మ సౌజన్యంతో శాంతివర్ధన ఆర్గనైజేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్తాధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ సీఈఓ రఘువీర్ అధ్యక్షత వహించారు. పీడీ జ్యోతిర్మయి, ఏడీ రామస్వామి మాట్లాడుతూ రైతులకు స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా పలు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, గర్భకోశ వ్యాధికి చికిత్స అందజేశారు. లేగ దూడలకు డీ వార్మింగ్, పశువులకు వాడే మిక్చర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాండ్రకోట, ఆర్‌బీ పట్నం, కిర్లంపూడి పశు వైద్యాధికారులు తోట నవీన్, రాకేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు గీత పరామర్శ



ఉప్పాడలో హేమంత్‌ను పరామర్శిస్తున్న వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను గురువారం మాజీ ఎంపీ, పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వంగా గీత పరామర్శించారు. కొండెవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గాది గంగబాబుకు, ఉప్పాడకు చెందిన తొమ్మండ్ర హేమంత్‌కు పితృవియోగం కలిగింది. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, నాయకులు ఉమ్మిడి జాన్, రావు చిన్నారావు, ఎంపీటీసీ మేరుగు ఎల్లాజీ, ఉమ్మిడి శ్యామ్, బొందు రాంబాబు తదితరులు ఉన్నారు.

అనుమతులు ఉంటేనే విక్రయించాలి



వాకతిప్పలో పురుగు మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జోగిరాజు

కొత్తపల్లి: పురుగు మందుల దుకాణాల్లో అనుమతులు ఉన్న మందులు మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు అన్నారు. మండలంలో ఉన్న పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. అధికంగా అమ్ముడయ్యే పురుగుమందుల నమూనాలను సేకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 15 ఎరువుల షాపుల్లో పురుగు మందుల నమూనాలు సేకరించామన్నారు. వాటిని ల్యాబ్‌కు పరీక్షల కోసం పంపుతామన్నారు. అనుమతులు లేని, కాలం చెల్లిన పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు అన్నీ గమనించాలన్నారు. పురుగు మందులు కొనుగోలు చేసిన రసీదులను భద్రంగా ఉంచాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలి

డాక్టర్ ఉమర్ ఆలీషా



మొక్క నాటుతున్న డాక్టర్ ఉమర్ ఆలీషా తదితరులు

పిఠాపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటి, వాటిని పరిరక్షించాలని శ్రీవిశ్వ విజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక విద్యా పీఠం చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక్కొక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ముందుగా డాక్టర్ ఉమర్ అలీషా మొక్కలు నాటగా, అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, అధ్యాపకులు ఎం.సుందరయ్య, డాక్టర్ కే.శారద, డాక్టర్ ఎం.రామారావు, ఉదయ భాస్కర్, లైబ్రేరియన్ ఎండీ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ పీఓలు డీవీ కాశీవిశ్వనాథం, వి.బుల్లి ప్రసాద్ తదితరులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఏవీవీ సత్యనారాయణ, రేఖా ప్రకాష్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.